సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 12 । నవంబర్ । 2024



సందడిగా సదర్

షాద్‌నగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాలు సందడిగా సాగాయి. కాస్త గలాటాకు దారి తీశాయి. 8లో▸



ఇబ్బంది రానీయొద్దు

వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది రానీయొద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణ అన్నారు. 8లో▸



'ప్రజా పంపిణీ' అస్తవ్యస్తం

పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలు తక్కువ ధరకు అందించే ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. 8లో▸

ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయం

'ధరణి'పై ప్రత్యేక దృష్టి
- వచ్చిన దరఖాస్తు వచ్చినట్టే క్లియర్
- పేదలకు నాణ్యమైన విద్య.. మెరుగైన వైద్యసేవలు
- విధి నిర్వహణలో నిరక్ష్యాన్ని సహించం
- 'సాక్షి'తో కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణలకు గురికాకుండా రక్షణ ఏర్పాట్లు చేస్తాం. నిరంతర నిఘా పెడతాం. సెంటు భూమి కూడా కబ్జా కాకుండా కాపాడతాం. అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం కూడా నేరం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా భూములను పీఓటీ కింద వెనక్కి తీసుకోవడానికి వెనుకాడబోం. ఇప్పటికే నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో కేసులు సైతం నమోదు చేయించాం. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చూడడం నా బాధ్యత' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్‌గా ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'సాక్షి'తో మాట్లాడారు.



పారదర్శకంగా సేవలు

జిల్లాలో భూ వివాదాలకు సంబంధించిన సమస్యలే అధికం. కలెక్టర్‌గా ధరణి పోర్టల్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తా. క్షేత్రస్థాయి అధికారులతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించి, దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూస్తా. వచ్చిన దరఖాస్తును వచ్చినట్లే క్లియర్ చేయిస్తా. మ్యూటేషన్లు, పాసుబుక్ జారీ, పేర్ల నమోదులో దొర్లిన తప్పులను సరి చేయడం, ఆధార్ నంబర్ ఎంట్రీ వంటి చిన్నచిన్న సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపుతాం. భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిస్సింగ్ సర్వే నంబర్, పట్టా భూములను అసైన్డ్/ప్రభుత్వ భూములుగా నమోదు చేయడం వంటి క్లిష్టమైన దరఖాస్తులను క్షేత్రస్థాయి అధికారులు అందించిన నివేదికల ఆధారంగా పరిష్కరిస్తాం. అవినీతి, అక్రమాలకు ఆస్కారమివ్వబోం. పూర్తి పారదర్శకంగా దరఖాస్తులను పరిష్కరిస్తాం.

అందరికీ విద్య, వైద్యం..

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన పేదలకు మెరుగైన వైద్య సేవలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత షాద్‌నగర్, శంకర్‌పల్లిలోని ఆస్పత్రులు సహా శంషాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించా. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాల్సిందిగా సూచించాం. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేసే వైద్యులపై నిఘా పెట్టాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశించాం. ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే ఆయా మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేశాం.

సర్వేకు గైర్హాజరైతే చర్యలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇంటింటి సర్వే సవ్యంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 6.57 లక్షల కుటుంబాలను గుర్తించి, ఇప్పటికే స్టిక్కర్లు అంటించాం. 5,344 మంది ఎన్యూమరేటర్లు మూడు రోజుల నుంచి కేటాయించిన ఇళ్లకు చేరుకుని, కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఆదివారం నాటికి 10 శాతం సర్వే పూర్తికాగా, సోమవారం నాటికి 19 శాతానికి చేరుకుంది. పదిహేను రోజుల్లో పూర్తి చేస్తాం. ఆదివారం సర్వేకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు విద్యాశాఖ షోకాజు నోటీసులు జారీ చేసింది. ఎంపిక చేసిన ఎన్యుమరేటర్ విధిగా సర్వేలో పాల్గొనాల్సిందే. లేదంటే వాళ్లపై చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిచే వారు ఎంతటివారైనా ఉపేక్షించబోం.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గురుకులం.. క్రీడా సంబురం

అట్టహాసంగా ప్రారంభమైన జోనల్ క్రీడలు

షాద్‌నగర్: గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన పోటీలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికాయిట్, చెస్, క్యారంతోపాటు అండర్- 17, అండర్- 19 విభాగాల్లో లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మేడ్చల్, మల్కాజిగిరి, జగద్గిరిగుట్ట, చేవెళ్ల, బంట్వారం, మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, ఆమనగల్లు, నల్లకంచ, గౌలిదొడ్డి, నార్సింగి, కమ్మదనం, సరూర్‌నగర్ గురుకుల పాఠశాలలకు చెందిన 1,125 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో భాగంగా విద్యార్థినులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. క్రీడా దుస్తులు ధరించి, జెండాలు చేతపట్టి జట్ల వారీగా మైదానంలో ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన వారిని సెల్యూట్ చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

న్యూస్‌రీల్

చేప పిల్లల పంపిణీలో తీవ్ర జ్యాపం

ఎమ్మెల్యే సబితారెడ్డి



రావిర్యాల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వం జ్యాపం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాల చెరువులో సోమవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల్లోనే చేప పిల్లలను పంపిణీ చేసి ఉంటే ఇప్పటికి వాటి ఎదుగుదల ఉండేదన్నారు. ఇప్పుడు పంపిణీ చేయడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. గత ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేయలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్యూచర్ సిటీ భూ బాధితుల సమావేశం

కందుకూరు: ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మించతలపెట్టిన 300 అడుగుల రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు మంగళవారం మండల పరిధిలోని అగర్‌మియాగూడలో సమావేశం కానున్నారు. భూములు ఇవ్వడానికి ఇష్టపడని రైతులంతా కలిసి సమష్టిగా పోరాటం చేయడానికి నిశ్చయించుకున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే సమావేశానికి రైతులకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నట్టు చెప్పారు. భూ బాధితులు అందరూ హాజరుకావాలని రైతులు లిక్కి జంగారెడ్డి, ఈర్లపల్లి భూపాల్‌రెడ్డి, డి.సుధాకర్‌రెడ్డి, నీరటి శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కొత్తూరు: రాష్ట్రవ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలువురు నాయకులు, కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లకు పైగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్నప్పటికీ కొందరు కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో వేతనాలు సరిపోక కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు జైపాల్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

మతం మారిన వారిని ఎస్సీలుగా గుర్తించొద్దు



అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ కులాల నుంచి క్రైస్తవులుగా, ముస్లింలుగా మతం మారినప్పటికీ అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్ అనుభవిస్తున్నారని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఉప్పల నరసింహ ఆరోపించారు. ప్రభుత్వం చేపడుతున్న కుల గణనలో మతం మారిన వారిని ఎస్సీలుగా గుర్తించొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎస్సీలకు కల్పించిన హక్కులను కొందరు ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కొన్నిచోట్ల మాదాసి కురువలు ఎస్సీ రిజర్వేషన్లను అక్రమంగా పొందే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ పరిరక్షణ సమితి సోషల్ మీడియా కన్వీనర్ శ్రీశైలం, ఆమనగల్లు కన్వీనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.



పదకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, సాఫీగా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పడకల్, తలకొండపల్లి, వెల్జాల్ గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు తలెత్తితే అక్కడికక్కడే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి పచ్చని పైర్లతో కళ కళలాడేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, వైస్ చైర్మన్ రవి కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, గూడూర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

- రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యయసాయ పండ్ల మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని, వ్యాపారుల సహకారంతో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. పాలకవర్గం, అధికారులతో కలిసి సోమవారం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో కొనసాగుతున్న క్రయ విక్రయాలను పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న ప్రతి వర్తకుడి అమ్మకాలను తనిఖీ చేసి కొనుగోలుదారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే వ్యాపారులు రోడ్డున పడ్డారని.. వ్యాపారం సరిగ్గా లేక చాలా నష్టపోయారని విమర్శించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూనే కోహెడలో నూతన మార్కెట్ నిర్మాణానికి ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నూతన పాలకవర్గం సహకారంతో రైతులకు న్యాయం చేస్తామని.. వచ్చే మామిడి సీజన్‌లో ఇబ్బంది లేకుండా చూసేందుకు ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ఎక్కువ కమీషన్ తీసుకునే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని, మార్కెట్‌లోని రైతులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, మార్కెట్ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పండ్ల రైతుల సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఆన్‌లైన్ వేదికగా గంజాయి దందా

- విదేశీ గంజాయి సైతం దిగుమతి
- ముగ్గురు నిందితుల అరెస్ట్

పహాడీషరీఫ్: ఆన్‌లైన్ వేదికగా గంజాయి సరఫరా చేస్తున్న పెడ్లర్లను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ డి.సునితా రెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇద్రీస్ కలీం అలియాస్ ఫర్హాన్, మహ్మద్ అబ్బాస్ కొన్నాళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఇందుకోసం స్థానికంగా రాజేంద్రనగర్‌కు చెందిన బండారి సునీల్ అలియాస్ సులేమాన్ (30), దారుస్సలాంకు చెందిన మహ్మద్ అస్లాం(32), మెహిదీపట్నంకు చెందిన మహ్మద్ అక్రం(30)ను పెడ్లర్లుగా నియమించుకున్నారు. విదేశాల నుంచి ఓజీ (ఓసియన్ గాంజ.. నీళ్లలో ప్రత్యేకంగా పండించే గాంజ)ని డార్క్ వెబ్ నెట్‌తో కొరియర్‌లో దిగుమతి చేసుకోవడం ప్రారంభించారు. ఇలా దిగుమతి అయిన ఓజీని మూడు, ఐదు గ్రామల ప్యాకెట్లలో ప్యాక్ చేసి రూ.12వేలు, రూ.18 వేలుగా ధర నిర్ణయించారు. దీంతో పాటు స్థానిక డ్రై గంజాయిని సైతం పెడ్లర్ల ద్వారా బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, మియాపూర్, ఉప్పల్, బాలాపూర్, శంషాబాద్ ప్రాంతాల్లో వినియోగదారులకు సోషల్ మీడియా యాప్‌ల ద్వారా బుక్ చేసుకున్న విధంగా విక్రయిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న డేటాను డిలీట్ చేస్తుంటారు. తాజాగా ఆదివారం రాత్రి ఆర్‌సీఐ రోడ్డులో గంజాయిని విక్రయించేందుకు ముగ్గురు పెడ్లర్లు సిద్ధంగా ఉండగా, విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.72.81 లక్షల విలువైన 34 ప్యాకెట్లలో ఉన్న 170 గ్రాముల ఓజీ, తొమ్మిది కిలోల ఎండు గాంజ, రూ.2.04 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక తూకపు మిషన్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు పెడ్లర్లను అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



పోలీసుల అదుపులో నిందితులు

అర్జీలు స్వీకరించి.. హామీ ఇచ్చి

- 'ప్రజావాణి'కి 67 దరఖాస్తులు
- అత్యధికం రెవెన్యూ సంబంధ సమస్యలే..
- పరిష్కారానికి కలెక్టర్ భరోసా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణికి బాధితులు క్యూ కట్టారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ స్వయంగా హాజరై.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యను ఓపిగ్గా వినడంతో పాటు సంబంధిత అధికారులను పిలిపించి, సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో 67 అర్జీలు అందగా, వీటిలో 56 రెవెన్యూకు సంబంధించినవే కావడం గమనార్హం. మరో 11 ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణలు, రోడ్ల ఆక్రమణలు, పార్కు స్థలాల కబ్జాకు సంబంధించిన ఫిర్యాదులు ఉండటం విశేషం. ఇదిలా ఉండగా ప్రమాదవశాత్తు పాఠశాల గేటుమీద పడి చనిపోయిన హయాత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

సర్వేలో తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దు

ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.సౌమ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలన్నారు. మండలాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లతో సమన్వయం చేసుకుంటూ, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు వారికి వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ సర్వేను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని తెలిపారు. రోజువారిగా పూర్తైన సర్వే ఫారంలను ట్రంక్ బాక్సుల్లో బ్లాకుల వారీగా భద్రపరిచాలని సూచించారు. ప్రతి ఫారంను కంప్యూటరీకరణ చేసుకోవడం కోసం కంప్యూటర్ ఆపరేటర్లను సమకూర్చుకోవడం, టెక్నికల్ సపోర్టు కంప్యూటర్లను మండలాల వారీగా, మున్సిపల్ వారీగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్‌మోహన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామారావు, డీఈఓ సుశీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను పట్టించుకోవడం లేదు

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ సమీపంలో రంగయ్య అనే వ్యక్తి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో పాటు 15 ఫీట్ల రోడ్డును ఆక్రమించారు. ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాల్సిందిగా అక్టోబర్ 16న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమార్కులకు అండగా నిలవడమే కాకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోండి.

– రమేష్, పెద్ద అంబర్‌పేట్

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

ఆదిబట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీప్లస్-2 నిర్మాణాలకు అనుమతులు తీసుకుని అంతకంటే ఎక్కువ అంతస్తులు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోండి.

– కోరె కళమ్మ, కౌన్సిలర్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- అట్టహాసంగా జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య

అనంతగిరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 10వ జోనల్ స్థాయి అండర్-14,17,19 బాలుర క్రీడాపోటీలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి ప్రారంభించారు. శివారెడ్డిపేట(అనంతగిరిపల్లి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల, కళాశాలల ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో ముందుగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో స్వాగతం పలికారు. అనంతరం పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉత్తమ శిక్షణ అందించాలని సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలల నుంచి 971 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల విద్యా సంస్థల జోనల్ ఆఫీసర్ నిర్మల, ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండలి చీఫ్ విప్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


మల్లేష్(ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం గోవిందపల్లికి చెందిన కంబాలపల్లి మల్లేశ్(34) జిల్లా పరిధిలోని బాలాపూర్ మండలం, జిల్లెలగూడలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో మండలంలోని కొత్తగూడ చౌరస్తా సమీపంలోని ఎంఎంఆర్ రెస్టారెంట్ శ్రీశైలం రహదారిపై ఎదురుగా అజాగ్రత్తగా, అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం అతని కారును ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సందడిగా సదర్

షాద్‌నగర్‌రూరల్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని వివిధ కాలనీల నుండి దున్నపోతులతో యాదవ సంఘాల నాయకులు ర్యాలీగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు ర్యాలీగా వచ్చారు.

బహుమతుల ప్రదానోత్సవంలో గలాటా

సదర్ వేడుకల్లో ఇద్దరు యువకుల మధ్య జరిగిన గొడవ గలాటాకు దారితీసింది. ఉత్సావాల సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఓ వేదిక ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల వారికి నిర్వాహకులు నచ్చజెప్పేందుకు యతించినా వినకపోవడంతో గొడవకు దారితీసింది. దీంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని చెదరగొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్‌తో పాటుగా పలువుకు యాదవ సంఘం నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కెమిస్ట్రీలో మూడు, ఎకనామిక్స్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. యూజీసీ నెట్, సెట్ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిఉన్న అభ్యర్థులు ఈ నెల 13 వరకు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6300019101 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారు ఆభరణాలు అపహరణ

యాచారం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన కడారి వెంకటయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోని రూ.2లక్షల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

శంకర్‌పల్లి: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాకరం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం చక్రంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య, యాదమ్మ దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువుకోసం కొడుతో కలిసి శంకర్‌పల్లికి వచ్చారు. శ్రీరాంనగర్ కాలనీలో ఉంటున్న క్రమంలో అనారోగ్యంతో లక్ష్మయ్య మృతి చెందాడు. యాదమ్మ తన కుమారుడు శ్రీకాంత్(22)తో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తతోంది. ఈ క్రమంలో ఈ నెల 7న రాత్రి బిల్డింగ్‌పై ఫోన్ మాట్లాడుతున్న శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేసే సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారుతోంది. తొమ్మిది రకాల సరుకులకుగాను కేవలం బియ్యం పంపిణీ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

రేషన్ పంపిణీలో భారీగా కోత

- బియ్యం మాత్రమే పంపిణీ
- ఇబ్బంది పడుతున్న పేదలు



కొత్తూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ప్రజా పంపిణీ వ్యవస్థ నిరీర్యమవుతోంది. దీంతో గ్రామాల్లో రేషన్ దుకాణాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. గతంలో రేషన్‌షాపుల్లో పప్పులు, బియ్యం, కిరోసిన్‌తో పాటు తొమ్మిది రకాల సరుకులను సరఫరా చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారికి అనుగుణంగా మార్పులు తీసుకువస్తుండడంతో సరుకుల పంపిణీ కార్యక్రమం అస్తవ్యస్తంగా మారుతోంది. ఆహారభద్రతకార్డుదారులకు ఏడాది నుంచి బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ పంచదారను నిలిపి వేశారు. దీంతో వారు నిత్యావసర సరుకులను మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

స్టాక్ లేదని సరఫరా బంద్

మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా 13 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 544, ఆహారభద్రత కార్డులు 7,619 ఉన్నాయి. ప్రస్తుతం వీరికి ప్రతీ నెల రేషన్‌షాపు నుంచి 1,73,582 కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. రెండేళ్ల క్రితం మండలంలో ప్రజా పంపిణీ దుకాణాల ద్వార నెలకు 7,940 లీటర్ల కిరోసిన్, 543 కిలోల పంచదారను పంపిణీ చేయగా ప్రస్తుతం స్టాక్ లేదంటూ సరఫరా నిలిపి వేశారు. గతంలో కేవలం అంత్యోదయ కార్డుదారులకు మాత్రమే పంచదార అందించారు. కిరోసిన్ సైతం కార్డులకు అనుగుణంగా రాకపోవడంతో వచ్చిన స్టాకులోనే అందరికి పంపిణీ చేశారు. ఆహారభద్రతకార్డు దారులకు కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం, అంత్యోదయ కార్డులో మాత్రం ఎంత మంది సభ్యులున్నా 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

కూలీరేట్లు పెరగక ఇబ్బందులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా రేషన్ దుకాణాల్లోనే నిత్యావసర సరుకులను తీసుకుంటున్నారు. మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నా మరింత నిర్వీర్యం అవుతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెరగక పోవడంతో మూడు పూటలా తిండి తినేందుకు సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఆందోళనలో డీలర్లు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఎక్కువ సరుకులు పంపిణీ చేసినప్పుడు డీలర్లకు సరిపడా కమీషన్ వచ్చేది. ఇప్పుడు కేవలం బియ్యంతో సరిపెట్టడంతో పరిస్థితి తలకిందులైంది. తక్కువ కార్డులున్న డీలర్లకు నెలకు తక్కువ కమీషన్ వస్తుండడంతో వారు ఆర్థిక భద్రతతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే వారు తమ డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు.

అన్ని సరుకులు రావట్లే



గతంలో రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు పప్పు, కిరోసిన్, ఉప్పు, సబ్బులు ఇలా మొత్తం తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తున్నారు. మిగిలిన సరుకులు కొందరికి మాత్రమే పంపిణీ అవుతున్నాయి.

– భాస్కర్, రేషన్ డీలర్, కొత్తూరు

చర్యలు తీసుకుంటాం



ప్రజా పంపిణీ దుకాణాలకు సరుకులు సరఫరా చేసే స్టాక్ పాయింట్‌లో కొన్నేళ్లుగా బియ్యం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో డీలర్లు సైతం అవే పంపిణీ చేస్తున్నారు. మిగిలిన సరుకుల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

సిటీలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో : నగరంలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఫ్జల్‌గంజ్, లాలాగూడ, సీఐలు లింగేశ్వర్ రావు, పైళ్ల కరుణాకర్‌రెడ్డిలను సీసీఎస్‌కు బదిలీ చేయగా మల్టీజోన్ నుంచి వచ్చిన నునావత్ రవికి అఫ్జల్‌గంజ్, కలమాల రఘుబాబుకు లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా, కలమ సతీష్‌రెడ్డికి సైబర్‌క్రైమ్‌లో బాధ్యతలు అప్పగించారు. సీసీసీలో పనిచేస్తున్న పల్లె పద్మను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

రైతులకు ఇబ్బంది రానీయొద్దు

జిల్లా సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణ

ఇబ్రహీంపట్నం: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 5న స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. కాగా కొనుగోలు కేంద్రం తెరిచినా ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదని బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాసులు, విజిలెన్స్ అధికారులు ఇబ్రహీంపట్నంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు ఈ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.

వారం రోజుల్లో నగదు జమ

కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యం తీసుకొచ్చాం. ఏమీ ఇబ్బంది లేదు. క్వింటాల్‌కు రూ.2,300, బోనస్ రూ.500 వారం రోజుల్లో ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెప్పారు. తరుగు పేరిట ధాన్యం తీయలేదు. బహిరంగ మార్కెట్‌లో రూ.2వేలకే అడిగారు.

– యాదగిరి రెడ్డి,రైతు, శేరిగూడ

రేపు డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ఈనెల 13న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బహిరంగ విచారణను నిర్వహిస్తుందని డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటించి స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. బుధవారం నిర్వహించే ఈ విచారణలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ తమ అభిప్రాయాలను కమిషన్కు తెలియజేయాలని కోరారు.

నెల రోజుల్లో రెండు సర్కారు కొలువులు


రవాణా శాఖ అధికారుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న కిరణ్‌కుమార్

శంకర్‌పల్లి: నెల రోజుల వ్యవధిలోనే మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్‌కి చెందిన కిరణ్ కుమార్ అనే యువకుడు రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై .. అబ్బురపరిచాడు. అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లాలో గ్రౌండ్ వాటర్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు తీసుకోగా.. సోమవారం అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నాడు. కొడుకు రెండు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు బాలయ్య, విజయలలిత ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వివాహానికి వెళ్తుండగా విషాదం

- రోడ్డు పక్కన ఆపిన బైక్‌ను ఢీకొట్టిన కారు
- భార్య మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు
- భర్తకు స్వల్పగాయాలు


రాములమ్మ మృతదేహం


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

ఇబ్రహీంపట్నం: నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ కుటుంబాన్ని కకావికలం చేసింది. సంతోషంగా భర్త, కుమారుడితో కలిసి ఓ వివాహ వేడుకకు బైక్‌పై వెళ్తున్న భార్యకు కారు రూపంలో మృత్యువు ఎదురైంది. రోడ్డు పక్కన నిలిపిన బైక్‌ను వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే భార్య మృతి చెందగా, తీవ్రగాయాలైన కుమారుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ విషాద సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం దేవనంపల్లి గ్రామానికి చెందిన పోలేపాక సాయిలు(36) మేస్త్రీ పనులు చేస్తూ బీఎన్ రెడ్డి సమీపంలోని నందిహిల్స్‌లో నివాసముంటున్నాడు. కుర్మేంద్ మండలం కిష్టరాంపల్లిలో జరిగే వివాహ వేడుకకు భార్య రాములమ్మ(34), కుమారుడు అరుణ్‌కుమార్(14)లతో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. మంగళ్‌పల్లి క్రాస్ రోడ్డు దాటగానే కూలింగ్ గ్లాసులు కొనేందుకు సాయిలు బైక్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములమ్మ అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు అరుణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్పగాయాలతో సాయిలు ప్రమాదం నుంచి గట్టెక్కాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అరుణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. నిర్లక్ష్యంగా కారును నడిపించి ప్రమాదానికి కారకుడైన మైలారం సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శబరిమల.. చేరేదెలా!

ఇప్పటివరకు ప్రత్యేక రైళ్ల ఏర్పాటుపై దృష్టి సారించని రైల్వే

- హైదరాబాద్ నుంచి 5 లక్షల మందికిపైగా అయ్యప్ప భక్తులు
- డిసెంబర్, జనవరి నెలల్లో భారీ రద్దీ
- ఇప్పటికే వందల్లో వెయిటింగ్.. శబరి ఎక్స్‌ప్రెస్‌లో 'నో రూమ్'

సాక్షి, సిటీబ్యూరో: శబరిమల.. అయ్యప్ప సన్నిధి.. హైదరాబాద్ నుంచి అయ్యప్ప సన్నిధిగా నేరుగా వెళ్లేందుకు శబరి ఎక్స్‌ప్రెస్ ఒక్కటే శరణ్యం. కానీ, అందులో ఇప్పటికే 'నో రూమ్'దర్శనమిస్తోంది. హైదరాబాద్ మీదుగా శబరిమల వైపు రాకపోకలు సాగించే పలు రైళ్లన్నీ ఇప్పటికే భర్తీ అయ్యాయి. అన్నింటిలోనూ ఫిబ్రవరి ఆఖరు వరకు వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. భక్తుల రద్దీ మేరకు అదనపు రైళ్ల ఏర్పాటుపై దక్షిణ మధ్య రైల్వే ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలను సిద్ధం చేయలేదు. దీంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే చార్జీలను భారీగా ఉంటున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మాలధారణతోపాటే భక్తులు ప్రయాణ సదుపాయాలను కూడా ఏర్పాటు చేసుకుంటారు. కానీ, చివరి నిమిషం వరకు ప్రత్యేక రైళ్లను ప్రకటించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి నెలకొంటోంది.

ఒకే ఒక్క రైలు...

ఏటేటా అయ్యప్ప భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది గ్రేటర్ హైదరాబాద్ నుంచి 5 లక్షల మందికిపైగా శబరిమలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు అంచనా. వారిలో చాలావరకు రైళ్లపైనే ఆధారపడతారు. ప్రైవేట్ వాహనాలు, విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య తక్కువే. రెగ్యులర్‌గా వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే పూర్తిగా నిండిపోయింది. మరో నెల వరకు టికెట్ బుక్ చేసుకొనేందుకు కూడా అవకాశం లేదు. మరోవైపు ఈ నెలాఖరు నుంచే భక్తుల ప్రయాణాలు మొదలవుతాయి. జనవరిలో మకరజ్యోతి దర్శనం కోసం ఎక్కువమంది ఆసక్తి చూపుతారు. కానీ, ఇందుకు తగినట్లుగా రైళ్లను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ''సకాలంలో రైళ్లు వేయకపోవడం వల్ల పది, పదిహేనుమంది భక్తులు కలిసి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాన్ని బుక్ చేసుకొని వెళ్లవలసి వస్తుంది. ఇలా వాహనాలను బుక్ చేసుకున్న తరువాత ప్రత్యేక రైళ్లు వేస్తే ఏం లాభం''అని బోడుప్పల్‌కు చెందిన అయ్యప్ప భక్తుడు సాంబశివరావు అభిప్రాయపడ్డారు.

సంక్రాంతి ప్రయాణం కష్టమే..

- ఈ సారి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు కూడా రైలు కష్టాలు తప్పేలా లేవు. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ భారీగా ఉంది. ఫిబ్రవరి వరకు కూడా వెయింట్ లిస్టు 200 నుంచి 250 వరకు ఉంది. కొన్ని రైళ్లలో రిగ్రేట్ కనిపిస్తుంది. అయ్యప్ప భక్తులతోపాటు సంక్రాంతి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కూడా ప్రత్యేక రైళ్లను వేయవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, హైటెక్ సిటీ తదితర ప్రధానస్టేషన్ల నుంచి ప్రతిరోజు 2.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి మొదటి వారం నుంచి ఇంచుమించు ఆ నెలాఖరు వరకు రోజుకు 50 వేల నుంచి లక్ష మంది చొప్పున అదనంగా ప్రయాణం చేయనున్నట్లు అంచనా.
- సంక్రాంతి సందర్భంగా కనీసం 25 లక్షల మంది నగరం నుంచి సొంత ఊళ్లకు వెళ్లి తిరిగి వస్తారు. ఈ మేరకు ముందస్తుగా అధికారులు రైళ్లను ప్రకటించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తీరా పండుగ సమీపించాక అదనపు రైళ్లు వేస్తున్నారు. దీంతో అప్పటికే ప్రయాణికులు బస్సులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారు. పైగా పండుగ ముందు అప్పటికప్పుడు ప్రత్యేక రైళ్లు వేయడం వల్ల ఎక్కువ శాతం సీట్లు దళారులే ఎగురేసుకుపోతున్నారు. సాధారణంగా శబరిమల ప్రత్యేక రైళ్లలో ఏటా ఇలాగే దళారుల దందా కొనసాగుతోంది. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తుగా ప్రత్యేక రైళ్లను ప్రకటించకపోవడం వల్ల సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్‌లోనూ దళారులు పాగా వేసే అవకాశం ఉంది. గోదావరి, విశాఖ, గరీబ్‌రథ్, నర్సాపూర్, ఫకల్‌నుమా, గౌతమి, మచిలీపట్నం, నర్సాపూర్, సింహపురి, నారాయణాద్రి, వెంకటాద్రి, పద్మావతి, రాయలసీమ తదితర అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పటికే భారీ వెయిటింగ్ ఉంది.